# సడలని బంధాలు

**శ్రీమతి డి. వాణి (సరస్వతి)**

—(౦)—

'విమలా!

బాబుకి సీరియస్‌గా ఉంది. వెంటనే రావాలి. ప్రకాశరావు' టెలిగ్రాం చదివిన విమల స్తంభించి పోయింది. 'అమ్మా! అమ్మా' అంటూన్న చిట్టి బాబు దీనస్వరూపం కళ్ళముందు మెదిలింది. దుఃఖం పొంగివచ్చింది.

'ఏడుస్తున్నావెందుకమ్మా?' అంటూ తండ్రి యెదురుగా వచ్చాడు.

'బాబుకి సీరియస్‌గా ఉందిట. వైరు వచ్చింది.' అన్నది బాధగా.

'ఈ నాటికి తన పొరపాటు గుర్తించాడన్నమాట' అన్నాడు కోపంగా.

ఆ రాత్రే తండ్రీ కూతుళ్లు బయల్దేరారు.

♦ ♦ ♦

ఆ రోజుల్లో విమల బి. ఏ స్టూడెంటు. సౌందర్యవతి, మధురగాయని అయిన విమలను ప్రకాశరావు ప్రేమించాడు. అతను యం. యస్. సి ప్యాసై ఆ కాలేజీలోనే లెక్చరరుగా ఉన్నాడు. ధనవంతుడు. విమలతో కోరి పరిచయం చేసుకొని పలుకరించేవాడు.

ప్రకాశరావు వివాహ ప్రస్తావన తెచ్చేసరికి విమల ఆశ్చర్యపడింది, తనకు అతనితో సరితూగగల స్తోమతు లేదని చెప్పింది. కాని పవిత్రప్రేమకు డబ్బు ఒక్కనాటికీ అడ్డుగోడ కాజాలదని ప్రకాశరావు వాదించాడు. మొదటినించి అతనిపై సదభిప్రాయంతో ఉన్న విమల చివరకు ఒప్పుకుంది.

వేసంగి సెలవుల్లో విమలా ప్రకాశరావుల వివాహం జరిగిపోయింది.

♦ ♦ ♦

సంవత్సరం గడిచిపోయింది. విమలకు కొడుకు కలిగాడు. ప్రకాశరావుకి కొలంబియా యూనివర్శిటీ నించి రిసెర్చికి సీటువచ్చింది. విమలకు ఆనందం, బాధ కలిగాయి. మూడేళ్ళవరకు భర్తను వదిలి ఉండాలని దిగులుపడింది.

'చదువుకున్నదానివి. అంత బెంగేమిటి విమలా! మూడేళ్ళు యిట్టే గడిచిపోతాయి' అంటూ ఊరడించాడు.

పసికందు నెత్తుకున్న విమల కన్నీళ్లతో భర్తకు వీడ్కోలిచ్చింది. బరువెక్కిన హృదయంతో ప్రకాశరావు ప్లేన్ యెక్కాడు.

♦ ♦ ♦

డాక్టరేట్‌తో తిరిగివచ్చిన ప్రకాశరావును విమల తండ్రీ, బాబు రిసీవ్ చేసుకున్నారు. బాబు చనువుగా తండ్రిదగ్గరకు వచ్చాడు. ప్రకాశరావు కళ్లు విమలకోసం వెతికాయి. కాని ఆమె కనబడలేదు. ఇంటికి వెళ్ళారు.

'విమలా! నామీద కోపమా?' ప్రకాశరావు మృదుస్వరం విని విమల తలెత్తింది. అతని కళ్లు తిరిగాయి. ఆమె సుందరరూపం పూర్తిగా మారిపోయింది.

'ఏమిటి విమలా!' బాధగా అరిచాడు. విమల కళ్లు అశ్రుపూరితాలయాయి.

'క్రిందటి వేసవిలో మశూచికం వచ్చింది' అన్నది గద్గదస్వరంతో. ప్రకాశరావు నిలువలేక మౌనంగా వెళ్ళిపోయాడు. ఎన్నో సంగతులు చెబుతాడని ఊహించిన విమల తెల్లబోయింది.

సాయంత్రం ప్రకాశరావు పిక్చర్‌కి వెళ్ళాడు.

'ఎంతో అందంగా ఉండే విమలను పొందగలిగానని లెక్చరర్ ప్రకాశరావు గర్వించాడు. తగిన శాస్తి అయిందిలే.' వెనుక సీటులో యెవరో అనుకుంటున్న మాటలు అతని చెవులకు సోకాయి. వెంటనే లేచి వెళ్లిపోయాడు.

విమల రూపం కళ్లముందు మెదిలింది. అవును! ఆమెను యిక యే ముఖంతో వెంటబెట్టుకొని పార్టీలకు, క్లబ్బులకు వెళ్లగలడు! ఇక నామెతో జీవితం కొనసాగించడం యెట్లా? అందగత్తె అయిన భార్య లేకపోతే చదువు, డబ్బు, హోదా వృధా! ఆలోచనలతో సతమత మాతూ ప్రకాశరావు యిల్లు చేరాడు.

♦ ♦ ♦

ప్రకాశరావు విమలతో సన్నిహితంగా వుండలేక పోయాడు. సాధ్యమైనంతవరకు తప్పించుకొని తిరగ సాగాడు. తనను ఓదారుస్తాడని, తనలో రేగిన ఆవేదన కరిగిపోతుందని ఊహించిన విమల అతని లోని మార్పు చూసి క్రుంగిపోయింది.

'నేనేం తప్పుచేశాను?' అని అడిగింది కాఫీ యిస్తూ.

'నన్ను విసిగించక వెళ్లిపో విమలా!' ఆమెను చూడకుండానే చిరాకుగా అరిచాడు. ఒకనాడు తన దర్శనం కోసం యెదురు తెన్నులు చూచిన ప్రకాశరావేనా యీ మాటలనేది! విమల నిర్ఘాంత పోయింది.

'ఈనాడు నా రూపంలో వచ్చిన మార్పు మీ కోపానికి కారణం కావచ్చు కాని...! కాని అది నా తప్పుకాదు. మీరు బాహ్యసౌందర్యాన్ని కాక, ఆత్మసౌందర్యాన్నే ఆరాధించారనే భావనతో నా దిగులుని అణచుకున్నాను. అది అపోహ అని తెలిసి పోయింది.' విమల కంఠంలో ఆమె హృదయావేదన తొణికిసలాడింది.

'ఛీ! నాకీయింట్లో సుఖంలేదు, బాబుని తీసుకొని వెళ్లిపోతాను,' అన్నాడు.

'సరే! నేను మీకు అడ్డుగా ఉండదల్చుకోలేదు. కాని ఒక్క మాట! బాబు నా సర్వస్వం. వాడిని నానుంచి దూరం చేస్తే బ్రతుకలేను' అన్నది కన్నీళ్లతో.

'వీల్లేదు బాబు నావాడు.-నా యిష్టం.' ప్రకాశరావు విసురుగా వెళ్లిపోయాడు.

ఆరాత్రే ప్రకాశరావు బాబును బలవంతంగా తీసుకొని వెళ్ళిపోయాడు.

♦ ♦ ♦

'బాబుపై బెంగతో విమల మంచంపట్టింది.

'నిన్నే చూసుకొని బ్రతుకుతున్నా నమ్మా! ప్రకాశం యేనాటికైనా మారకపోడు. దిగులు పడితే నేను చూడలేను విమలా!' అనేవాడు తండ్రి దీనంగా. తండ్రిమాటలతో విమల లేని ధైర్యం తెచ్చి పెట్టుకొని తిరగసాగింది.

విమల బి. యి డి. లో చేరింది.

'నీవు ఉద్యోగం చేయడం నా కెంతమాత్రం యిష్టంలేదు. కోరి చేసుకొని యింత మూర్ఖంగా అన్యాయం చేస్తాడని అనుకోలేదు. కేసు పెట్టి ముప్పు తిప్పలూ పెట్టాలి.' అనేవాడు కోపంగా.

'కేసులవల్ల డబ్బు రాబట్టుకోవచ్చును కాని అతనిలో లేని అనురాగాన్ని కొని తెచ్చుకోలేం కదూ! అతన్ని బాధించడం నా అభిప్రాయం కాదు, అనేది బాధగా. ట్రైనింగు పూర్తికాగానే విమలకు ఉద్యోగం దొరికింది. తండ్రీ కూతుళ్ల జీవితం సాఫీగా గడిచిపోసాగింది.

♦ ♦ ♦

ప్రకాశరావుకి ఢిల్లీలో ఉద్యోగమైంది. బాబుని చూచుకొందుకు ఆయాను పెట్టాడు. కొందరు తిరిగి వివాహం చేసుకొమ్మని సలహా యిచ్చారు. కాని యెందుకనో అంగీకరించలేకపోయాడు. ఏదో లోటుతోనే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. బాబుని మరిపించడం యెంతో కష్టమైపోయింది.

బాబుకి అయిదోయేడు వచ్చింది. స్కూల్లో చేర్పించాడు. కాని బాబుకి తల్లిలేనిలోటు బాగా కన్పించసాగింది. స్కూలు విడవగానే పిల్లలంతా

'మమ్మీ, మమ్మీ' అంటూ పరుగెత్తేవారు. విమల రూపం లీలగా ఆ పసి హృదయంలో మెదిలేది. దిగులుగా ఉండిపోయేవాడు.

బాబు దిగులుగా ఉండటం ప్రకాశరావు పసికట్టాడు. ఎక్కువ శ్రద్ధతో యేలోటూ కన్పించనివ్వకుండా ముద్దుగా చూచుకోసాగాడు.

ఆ నాడు బాబు పుట్టిన రోజు. క్రొత్త బట్టలు, పిండివంటలు తయారైనాయి. కాని వాటివైపే చూడలేదు.

'నీకింకా యేంకావాలి _ చెప్పు బాబూ!' అంటూ బుజ్జగించాడు.

'నాకు అమ్మ కావాలి నాన్నా!' బాబు ఆశగా తండ్రి కళ్ళలోకి చూశాడు. ఆ మాట ప్రకాశరావు హృదయాన్ని బాణంలా దూసుకుపోయింది.

'సరేలే బాబూ! అమ్మను రమ్మంటాను' అని లేచి వెళ్ళిపోయాడు.

బాబు అమ్మకోసం ప్రతి రోజూ తండ్రిని వేదించసాగాడు. ఒక్కొక్కసారి ప్రకాశరావుకి విసుగెత్తేది. బాబును పంపించేయాలనుకొనేవాడు. కాని బాబును వదిలి ఉండలేనని బాధపడేవాడు.

ఆ రోజు బాబుకి జ్వరం వచ్చింది. ప్రకాశరావు సెలవుపెట్టి యింటి దగ్గరే ఉండిపోయాడు.

'నాన్నా! అమ్మ యెప్పుడొస్తుంది నాన్నా!' అని బాబు దీనంగా పలవరించసాగాడు. ప్రకాశరావుకా పలవరింత సమ్మెటపెట్టులా ఉండేది. మందు లిస్తే మనోవ్యాధి నయంకాదని అనుభవం మీద బోధపడింది.

'అబ్బాయికి కావలసిన వ్యక్తిని రప్పిస్తేకాని ప్రయోజనం ఉండదు,' అని పెదవి విరిచాడు డాక్టరు. ప్రకాశరావులో ఆవేదన తలెత్తింది. విమలను వదిలి రావడం అన్యాయమని, తల్లీ పిల్లలను వేరుచేయడం మహా పాపమని అంతరాత్మ ఘోషిస్తోంది. విమలతో గడిపిన మధుర జీవితం కళ్లకు కట్టింది. సంసారం సుఖప్రదంగా ఉండటానికి సౌందర్యం కారణం కానేరదని అర్థమైంది. రెండేళ్లూ సారంలేని జీవితం గడపవలసి రావడం స్వయంకృతాపరాధమని తోచింది. బాబు ముఖంలో ఆమె దీనస్వరూపం మెరిసింది. వెంటనే టెలిగ్రాం యిచ్చాడు,

◆ ◆ ◆

'చూడు బాబూ నీ అమ్మని! వచ్చాను.' విమల ఆత్రుతగా బాబు మంచంమీద కూర్చుని బాబుని ఒడిలోకి తీసుకుంది. ఆమె చల్లని స్పర్శతో బాబు కళ్లు తెరిచాడు. 'అమ్మా!' అంటూ విమలను పెనవేసుకున్నాడు. ఆ దృశ్యం ప్రకాశరావును కదల్చివేసింది.

విమల రాకతో బాబు జ్వరం తగ్గిపోయింది. ఉత్సాహంగా తిరగసాగాడు. ప్రకాశరావు సిగ్గుతో విమలతో ఒక్క మాట కూడ మాట్లాడలేకపోయాడు.

వారం రోజులు గడిచాయి. ప్రకాశరావు వ్రాసుకుంటూంటే బాబు యేడుపు ముఖంతో తండ్రి దగ్గరకు వచ్చాడు.

'అమ్మ వెళ్లిపోతుందట. నన్నూ రమ్మంది. నిన్నొదిలి వెళ్లను నాన్నా! నాకు అమ్మకూడ కావాలి! అమ్మను ఉండమను!' బాబు మాటలకాతని హృదయం కరిగిపోయింది. ఇక మౌనంగా ఉండలేకపోయాడు. బాబు నెత్తుకొని విమల దగ్గరకు వెళ్లాడు. ఆమె యేడుస్తోంది.

'విమలా,' ప్రేమ పురస్సరమైన పిలుపు విని ఆమె త్రుళ్లిపడింది.

'ఒకసారి నిన్ను కాదని జీవితంలో ఓడిపోయాను విమలా! తిరిగి ఆ పొరపాటు చేయ్యదల్చుకోలేదు. నన్ను మన్నించి నీ ప్రేమైక హృదయంలో స్థానం యిస్తావని ఆశిస్తున్నాను. నీకిక దూరంగా ఉండలేను విమలా!' అన్నాడు రుద్ధకంఠంతో. విమల చెవులకా మాటలు పన్నీటి జల్లులైనాయి, పెదవులపై చిరునవ్వు మెరిసింది.

ప్రకాశరావు హృదయంలో ఆనందం ఉరకలు వేసింది.

'అమ్మ యిక్కడే ఉంటుంది బాబూ!' అన్నాడు, బాబు సంతోషంతో స్నేహితుల వద్దకు పరుగెత్తాడు.

విమల సంతోషంతో ప్రకాశరావు హృదయం మీద వాలిపోయింది.